# తోతాపురికి 'సిండికేట్' దెబ్బ!

- జిల్లాలో మామిడి రైతుకు ధరాఘాతం
- కలెక్టర్ జోక్యం చేసుకున్నా ఇంకా ఖరారు కాని ధర
- కొనుగోలుకు ముందుకు రాని పల్ప్ యూనిట్లు
- గతేడాది టన్ను రూ.18 వేలు.. ఇపుడు అడిగేవారే కరువు
- కళ తప్పిన మ్యాంగోనగర్, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు
- పట్టించుకోని ప్రభుత్వం.. దిక్కుతోచని స్థితిలో రైతాంగం


పుత్తూరు మార్కెట్‌లోని మండీలో రాశులు పోసిన మామిడి కాయలు

**గతేడాది హాట్‌కేకుల్లా అమ్ముడైన తోతాపురిపై.. ఈ సీజనులో సిండికేట్ దెబ్బ పడింది! ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం.. పల్ప్ యూనిట్లు సిండికేట్‌గా మారి కొనుగోలుకు ముందుకు రాకపోవడం.. వెరసి మార్కెట్‌కు వచ్చే దిగుబడులను రైతులు తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. గతేడాది టన్ను రూ.18 వేల నుంచి రూ.20 వేలకు పలికిన తోతాపురి రకం మామిడిని ఇప్పుడు రూ.4 వేలకు మించి కొనుగోలు చేయడం లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పల్ప్ యూనిట్లు సిండికేట్‌గా మారి.. రైతులను నిలువునా ముంచేస్తున్నా మద్దతు ధర ప్రకటించి నిక్కచ్చిగా అమలు చేయాల్సిన ప్రభుత్వం ఇంకా చోద్యం చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి!**

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా మామిడి రైతుకు ధరాఘాతం తాకింది. 60 వేల ఎకరాల్లో మామిడి పంట సాగవుతుండగా.. అందులో సింహభాగం తోతాపురి. పల్ప్ తయారీకి ఈ రకాన్ని విరివిగా వినియోగిస్తారు. సీజను మొదలై నెల రోజులవుతున్నా తోతాపురి రకం మామిడి ధర ఇంకా ఖరారు కాలేదు. జిల్లాలోని పల్ప్ తయారీ యూనిట్లు ఇప్పటి వరకూ మామిడి కొనుగోలుకు ముందుకు రాలేదు. మ్యాంగోనగర్ పేరిట దేశవ్యాప్త గుర్తింపు కలిగిన పాకాల మండలం దామలచెరువులోని మార్కెట్‌లో గతేడాది తోతాపురి ధర టన్ను రూ.18 వేలు పలికింది. అయితే ప్రస్తుత సీజను మొదలై నెల దాటుతున్నా తోతాపురి కావాలని అడిగే వారు లేరు. జిల్లాలోని పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు సైతం ఇదే దుస్థితితో కళ తప్పాయి.

## ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సాగు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉండేది. మామిడి పల్ప్ తయారీ యూనిట్లు కూడా ఈ జిల్లా పరిధిలో అత్యధికంగా ఉన్నాయి. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత తిరుపతి జిల్లా పరిధిలో 60 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఇందులో 34 వేల ఎకరాల్లో తోతాపురి రకం మామిడి తోటలున్నాయి. బేనీషా రకం 15 వేల ఎకరాల్లో, నీలం, సిందూర, ఖాదర్ తదితర ఇతర రకాలన్నీ కలిపి మరో 10 వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. జిల్లాలో 21 వేల రైతు కుటుంబాలు మామిడి పంటపై ఆధారపడి ఉన్నాయి. ఇందులో ఉపాధి హామీ పథకం కింద రెండు మూడు ఎకరాల్లో మామిడి పెంపకం చేపట్టిన సన్న, చిన్నకారు మెట్ట రైతులే అధికం. ఏడాదంతా పెట్టుబడి పెట్టి మే-జూన్ రెండు నెలల సీజన్ కోసం ఆశగా వేచి చూసే ఈ రైతు కుటుంబాలకు ఏటా ధరలు చుక్కలు చూపుతున్నాయి. జిల్లాలో ఏడు పల్ప్ తయారీ యూనిట్లు వున్నాయి. పల్ప్ తయారీకి ప్రధానంగా బెంగళూరు కాయలుగా పిలిచే తోతాపురం రకం మామిడినే వినియోగిస్తారు. ఈ యూనిట్ల కొనుగోలు పైనే తోతాపురి మామిడి ధరలు ఆధారపడి వుంటాయి.

## మార్కెట్లలో తోతాపురి అడిగే వారేరీ?

గత సీజనుతో పోలిస్తే తోతాపురి ధర పూర్తిగా పడిపోయింది. దామలచెరువు, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లు ఉన్నాయి. ఈ మూడు మార్కెట్లలో కలిపి ఏటా సీజనులో అన్ని రకాల మామిడి క్రయవిక్రయాలతో రూ.600 కోట్ల నుంచీ రూ.700 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అందులో తోతాపురి వాటాయే అధికం. దామలచెరువులోని మ్యాంగోనగర్ మార్కెట్‌లో గతేడాది తోతాపురి టన్ను రూ.12 వేల నుంచి రూ.18 వేలు పలికింది. ఇపుడు సీజను మొదలై నెల గడుస్తున్నా ఇంతవరకూ ఈ రకం మామిడి కావాలని అడిగే నాథుడు లేడని అటు రైతులు, ఇటు మండీల యజమానులు వాపోతున్నారు. తిరుచానూరు మార్కెట్‌లో గతేడాది తోతాపురి గరిష్ఠంగా టన్ను రూ.20 వేలు పలికితే ఇపుడు గరిష్ఠంగా రూ.4 వేలకు మించి పలకడం లేదు. పుత్తూరు మార్కెట్‌లో కూడా ఈ రకం కాయలను అడిగేవారు లేరు.

## ఎందుకిలా?

మే నెలలో కురిసిన అకాల వర్షాలకు 60 శాతానికి పైగా తోటల్లో మామిడి కాయలు త్వరగా పక్వానికి వచ్చేశాయి. దీంతో అనివార్యంగా రైతులు వాటిని కోసి మార్కెట్లకు తరలించాల్సి వస్తోంది. ఇంకా ఆలస్యం చేస్తే చెట్లపైనే మాగిపోయే పరిస్థితి. దానికి తోడు నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రభావం చూపడంతో ఆ మేరకు వర్షాలు మే నెల మూడో వారం నుంచే అడపాదడపా కురుస్తున్నాయి. గాలివానకు కాయలు రాలిపోవడం, దెబ్బతింటాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. అందుకే ధరతో నిమిత్తం లేకుండా పంట కోతలు పూర్తి చేసి హడావుడిగా మార్కెట్ బాట పడుతున్నారు. రైతుల దుస్థితిని కొనుగోలుదారులు అవకాశంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

## ధర నిర్ణయించని పల్ప్ యూనిట్లు

కొనుగోళ్లు మొదలు కాకపోవడానికి కారణం ఇప్పటి వరకూ ధర నిర్ణయించకపోవడమే. ఏటా మాదిరిగా ఈ సీజను ప్రారంభంలో కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లాలోని ఏడు పల్ప్ యూనిట్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినప్పటికీ ధర మాత్రం నిర్ణయించలేదు. రైతులకు గిట్టుబాటయ్యే ధరతో కొనాలని కలెక్టర్ కోరినా పల్ప్ యూనిట్ల ప్రతినిధులు స్పందించడం లేదు. వారు సిండికేట్ తరహాలో వ్యవహరిస్తున్నా అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. మరోవైపు సప్లయర్స్‌గా పేరు పెట్టుకున్న దళారులు రైతుల నుంచి టన్ను రూ.6 వేలు, రూ.7 వేల చొప్పున కొనుగోలు చేసి పల్ప్ తయారీ యూనిట్లకు తరలిస్తున్నారు. మార్కెట్లలో నిల్వ చేసుకునే సదుపాయం లేనందున రైతులు తక్కువకు కాయలు తెగనమ్ముకుంటున్నారు.

## ఏటా దోపిడీయే..

తోతాపురి రకం మామిడి టన్ను రూ.20 వేలు పలికితేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. అయితే గిట్టుబాటు ధర లభించిన దాఖలాలు ఇప్పటి దాకా లేవు. ఏటా ధరల పతనంతో తోతాపురి రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఉదాహరణకు 2022 సీజనులో తోతాపురి రకం మామిడి సగటున టన్ను రూ. 12 వేలు పలకగా 2023లో రూ. 14 వేలు, 2024లో రూ. 16 వేలు చొప్పున పలికింది. గతేడాది టన్ను రూ. 12 వేల నుంచీ రూ. 18 వేల వరకూ పలికింది. ప్రస్తుత సీజనులో నెల దాటుతున్నా కొనుగోళ్ళు మొదలు కాలేదు. దామలచెరువు, పుత్తూరు, తిరుచానూరు మార్కెట్లలో టేబుల్ వెరైటీ కింద టాప్ క్వాలిటీ కలిగిన తోతాపురి కాయలను మాత్రమే బయటి నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేసి, నగరాలకు రవాణా చేస్తారు. అయితే ఇవి దిగుబడిలో కేవలం పదిశాతం లోపే వుంటాయి. మిగతా 90 శాతం దిగుబడిని పల్ప్ యూనిట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

## రూ.600 కోట్ల ఉత్పత్తులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏటా జిల్లాలో రూ.600 కోట్లకుపైగా మామిడి వ్యాపారం సాగుతోంది. 21 వేల రైతు కుటుంబాలకు, మరెంతో మంది వ్యాపారులు, మండీ ఏజెంట్లు, దళారులు, పల్ప్ యూనిట్ల యాజమాన్యాలు, అక్కడ పని చేసే కార్మికులు, మార్కెట్లలో పనిచేసే కూలీలు... ఇలా వేలాది మందికి ఆదాయాన్నిచ్చే ఈ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. జిల్లాలో మామిడికి మద్దతు ధర ప్రకటించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తదితరులు ప్రభుత్వాన్ని కోరారు. అయినా యూనిట్ల యజమానులు ధరలు ఇంకా నిర్ణయించలేదు. ప్రభుత్వం కూడా మద్దతు ధర ప్రకటించలేదు.


మ్యాంగోనగర్ మార్కెట్‌లోని ఓ మండీలో పక్వానికి వచ్చి మాగిపోయే స్థితిలో ఉన్న తోతాపురి రకం

## కఠిన చర్యలు తీసుకుంటేనే తప్ప!

గతంలో పల్ప్ యూనిట్ల ప్రతినిధులు ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొనుగోలు చేయని సందర్భాలు తలెత్తినపుడు ప్రభుత్వం నుంచి రాయితీలు ఆపేస్తామని కలెక్టర్లు హెచ్చరించిన ఉదంతాలున్నాయి. ఇప్పుడూ అదే తరహా కఠిన వైఖరి తీసుకుంటే తప్ప తోతాపురి మామిడి రైతులకు గిట్టుబాటు ధర దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికైనా మామిడి రంగంపై ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాల్సిన అవసరముంది.

### కాయలు పక్వానికి వచ్చినా ధర నిర్ణయించలేదు



జిల్లాలో తోతాపురి రకం మామిడి కాయలు 60 శాతం తోటల్లో పక్వానికి వచ్చేశాయి. వాటిని చెట్లపై వదిలేసే పరిస్థితి లేదు. వర్షాల సీజను మొదలైంది. ఎప్పుడు గాలి వాన వస్తుందో తెలీదు. గాలివానలకు కాయలు దెబ్బతింటాయి. అందువల్ల రైతులంతా కాయలు కోసేసి మార్కెట్‌కు తెచ్చేస్తున్నారు. కానీ జిల్లాలో పల్ప్ తయారు చేసే యూనిట్ల యాజమాన్యాలు ఇంత వరకూ ధర నిర్ణయించలేదు. ఇప్పటికే సగం సీజను గడిచిపోయింది. ఇప్పటికైనా ధర నిర్ణయిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- గిరిధర్‌రెడ్డి, మండీ యజమాని, దామలచెరువు మ్యాంగోనగర్ మార్కెట్

### తోతాపురి కొనేవాళ్లు లేరు



ఈసారి సీజను అధ్వానంగా వుంది. తోతాపురి కేజీ రూ. 3 నుంచి రూ. 4 కూడా పోవడం లేదు. అసలు తోతాపురి అడిగేవాళ్లే లేరు. వానలు పడేకొద్దీ కాయలు కొనడం ఇంకా తగ్గిపోతుంది. మార్కెట్ పరిస్థితి ఏమీ బాగాలేదు. రైతులకు కోత కూలి, ట్రాక్టరు బాడుగలకు కూడా రావడం లేదు. గతంతో ఈ సీజనుకు పోలికే లేదు.

- రామచంద్ర, మండీ యజమాని, తిరుచానూరు మార్కెట్

### కలెక్టర్ చెప్పినా పరిశ్రమలు వినడం లేదు



జ్యూస్ ఫ్యాక్టరీల వాళ్లంతా సిండికేట్ అయ్యారు. ప్రభుత్వం తరపున కలెక్టర్ చెప్పినా రైతులకు గిట్టుబాటు రేటు ఇవ్వడం లేదు. వానలొచ్చినా, ఎండలు కాసినా ఫ్యాక్టరీల వాళ్లు నిర్ణయించిన రేటుకే జ్యూస్ బాటిళ్లు అమ్ముతున్నారు. రైతు పండించిన పంటకు మాత్రం ఎందుకు రేటులో హెచ్చుతగ్గులు?

- కేశవులు, మామిడి రైతు, కేవీఆర్‌పురం, పుత్తూరు మండలం

# ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయంలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 589మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,913, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,105 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,152మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,304, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 469, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 261, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 63మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,051 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.




సోమల సమీపంలో రోడ్డు పక్కన పారబోసిన తోతాపురి మామిడి కాయలు

## రైతు కష్టం.. రోడ్డు పాలు!

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలు నాణ్యత లేదని కొనేవారు కరువయ్యారు. ఒకవేళ కొన్నా గిట్టుబాటూ ధరా లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఏడాదిపాటు కష్టించి సాగుచేసిన మామిడి కాయలను ఏం చేయాలో తెలియక రైతులు.. రోడ్డు పాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా తసోమల - సదుం, సోమల - కలికిరి మార్గాల్లో రోడ్లపక్కన పారబోసిన మామిడి కాయలే కనిపిస్తున్నాయి.

# సర్వర్ డౌన్

- రేషన్ సరుకుల పంపిణీలో అవస్థలు
- రెండో రోజు తెరుచుకోని 50 షాపులు


తిరుపతిలో సర్వర్ పనిచేయలేదంటూ కార్డుదారుకు చెబుతున్న డీలరు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఎర్రర్, మరోసారి ప్రయత్నించండి.. సర్వర్ డౌన్‌తో ఈపోస్ యంత్రంలో పదే పదే ప్రత్యక్షమైన పదాలివి. ఇలా.. సోమవారం ఉదయం నుంచీ జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీకి తరచూ అంతరాయం ఏర్పడటంతో కార్డుదారులు, డీలర్లు ఇబ్బంది పడ్డారు. తిరుపతితో పాటు దాదాపు 90 శాతం దుకాణాల్లో ఉదయం 11.15 నుంచి రెండు గంటల పాటు సర్వర్లు పూర్తిగా డౌన్ అయ్యాయి. దీంతో నిత్యావసర వస్తువులు పంపిణీ బాగా మందగించిందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి నిలబడిన కార్డుదారులకు సకాలంలో సరుకులు అందక అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలామంది తిరుగు ముఖం పట్టారు. కొందరు డీలర్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా.. సెంట్రల్ సర్వర్ మొరాయించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు. సర్వర్లు మొరాయిస్తుండడంతో కార్డుకు ఫింగర్ ప్రింట్ వేసి, లాగిన్ కావడం నుంచి.. బియ్యం వేసే వరకు కార్డుకు 25 నిమిషాలు నుంచి అర గంట వరకు సమయం తీసుకుంటుందని శివజ్యోతినగర్ డీలర్ చెప్పారు. తాను సాయంత్రం 4 నుంచి ఏడు గంటల వరకు కేవలం తొమ్మిది కార్డులకు మాత్రమే బియ్యం, చక్కెర ఇవ్వగలిగానని తెలిపారు. ఒకేసారి వేలాది మంది డీలర్లు లాగిన్ కావడంతో సమస్య ఉత్పన్నమైందని రెండు మూడు రోజుల్లో అంతా సర్దుకుంటుందని అధికారులు చెపుతున్నారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును ఆంధ్రజ్యోతి సంప్రదించగా సర్వర్లు డౌన్ అయిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఇదిలా వుండగా వివిధ కారణాలతో జిల్లాలోని 1457 దుకాణాల్లో రెండవ రోజు 50 మంది డీలర్లు దుకాణాలు తెరచి సరకులు పంపిణీ చేయలేదని డీఎస్‌వో చెప్పారు. 15వ తేది వరకు సరుకుల పంపిణీకి సమయం ఉందని, అవసరమైతే ఒకట్రెండు రోజులు గడువు పెంచే అవకాశం ఉంటుందని, అందువల్ల కార్డుదారులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కాగా, రెండో రోజు దాదాపు 32,541 మందికి బియ్యం పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇది తొలి రోజు కేవలం 16 శాతం మందికి మాత్రమే సరుకులు కావడం గమనార్హం.

## ఏనుగుల దాడులపై నేడు ప్రజలకు అవగాహన

భాకరాపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శేషాచల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలు.. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జనార్దన్ రాజు తెలిపారు. మండలంలోని చిట్టేచర్ల పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌తో పాటు అటవీశాఖ అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కల్నల్ సతీందర్ దహియ

రామచంద్రాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ అన్నారు. మండలంలోని సి.రామాపురం గ్రామంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆవరణలో సోమవారం 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి సంగీతంతో కూడిన పాటలు పాడిన, విన్న మనసుకు ఆహ్లాదకరంగా ఉంటుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు పాటల పోటీలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్, పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండింగ్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే, కార్యాలయ పర్యవేక్షకులు సురేష్‌కుమార్, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్, శిక్షణ అధికారి లక్ష్మీనరసింహ, ఉపేంద్ర పాల్గొన్నారు.

## నజీర్ కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

తిరుపతి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీలో అనారోగ్యంతో మృతిచెందిన నజీర్ కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. రూ.5వేలు అందించారు. ఎంపీటీసీ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## 9 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీ శాఖ అధికారులు

మంగళం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రేంజ్ అటవీ శాఖ అధికారులు ఆదివారం పెట్రోలింగ్ నిర్వహించి 9 ఎర్రచందనం దుంగలతో పాటు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బంది రాత్రి 11.45 గంటల సమయంలో మామండూరు నుంచి రేణిగుంట వైపుగా పెట్రోలింగ్ చేపట్టారు. ఏపీ09 ఏబీబీ8199 నంబరు గల కారు అతివేగంగా రావడాన్ని గమనించి ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ ఆపకుండా శ్రీనివాసపురం వద్ద వాహనాన్ని వదలిపారిపోయారు. వాహనంలో తనిఖీ చేయగా 9 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించారు. వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం 286 కేజీల బరువు ఉందని, వాహనంతో సహా రూ.8 లక్షలు ఉంటుందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, వెంకటేష్, ప్రసాద్, నవీన్, రవి పాల్గొన్నారు.

## మహిళ మెడలో సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. నాయుడుపేట పట్టణంలోని కొత్త బీడీ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రమ్మ ఆదివారం సాయంత్రం గ్రీన్‌సిటీ సమీపంలో వాకింగ్ చేస్తుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు చంద్రమ్మ మెడలో సరుడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట - ఎల్‌ఏ సాగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి జాతీయ రహదారి సమీపంలో వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నలుపు, తెలుపు, గడుల చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## పాముకాటుతో రైతుకు అస్వస్థత

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని కొత్తపట్నంలో సోమవారం పాముకాటుకు గురైన రైతు వెంకటేశ్వర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు పొలంలో వేరుశనగ పంటను పరిశీలిస్తూ వెళ్లుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు గూడూరు ఆస్పత్రికి తరలించారు.

### హత్యాయత్నం కేసు నమోదు

కోట పట్టణ పరిధిలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో కుదురు రమణయ్యపై హత్యాయత్నం జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. రమణయ్య కోట బజారుసెంటర్ నుంచి తాను నివాసం ఉంటున్న కోటమ్మగుడి కాల నీకి మోటరు బైక్‌లో వెళ్తుండగా గురుకులం క్వార్టర్స్ వద్ద గుర్తుతెలి యని వ్యక్తులు కారం చల్లి హత్యాయత్నం చేయబోయారని, కేకలు వేయడంతో నిందితులు పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు

## ఆగిన విద్యుత్ సరఫరా

● 15 గంటల తరువాత పునరుద్ధరణ

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలోని ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం 15 గంటలపాటు విద్యుత్ ఆగి పోయింది. తహసీల్దారు, ఎంపీడీవో, ఎమ్మార్సీ, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, వెలుగు, పోలీస్‌స్టేషన్, ఐసీడీఎస్, బాలసదనం, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం మధ్యాహ్నం వరకూ విద్యుత్ రాకపోవడంతో ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉక్కపోత తట్టుకోలేక కొంతమంది కార్యాలయాల బయటకు వచ్చి సేదతీరారు. ట్రాన్స్‌కో అధికారులు ఆలస్యంగా స్పందించి సాయంత్రం నాలుగు గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

### అమ్మవారి సేవలో

## మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ వెంకటరమణ

తిరుచానూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## నా దర్శకత్వంలో 'నంది' సినిమా

- బాలీవుడ్ నటుడు సోనూసూద్



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో సోనూసూద్

తిరుమల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ నటుడు, సామాజిక సేవకుడు సోనూసూద్ సోమవారం సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. సతీమణి సోనాలి, కుమారులు ఇషాంత్ అయాన్‌లు ఆయన వెంట ఉన్నారు. అనంతరం సోనూసూద్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తాను తొలిసారిగా 25 ఏళ్ల క్రితం శ్రీవారిని దర్శించుకున్నానని గుర్తుచేసుకున్నారు. తాజాగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో 'నంది' అనే కొత్త సినిమాను ప్రారంభించబోతున్నామని, అందులో తాను నటించడంతో పాటు దర్శకుడిగా కూడా వ్యవహరించబోతున్నట్టు వెల్లడించారు.

### నాణ్యత, రుచితో

## పౌష్టికాహారం అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమరావతి, భాస్కర్‌బాబు

చంద్రగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించడమే మన బాధ్యత అని జిల్లా అధికారి, వీసీ టాటా ట్రస్ట్ అమరావతి అన్నారు. చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకంలో వంట చేసే కార్మికులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంఈవో భాస్కర్‌బాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. లోపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి, కార్మికులకు బహుమతులు ప్రదానం చేశారు.

### వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

### ఉద్యోగుల బదిలీలకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీవరకు పొడిగించింది. మే 15వ తేదీన ప్రకటించిన షెడ్యూలు ప్రకారం అన్ని శాఖల్లో బదిలీల గడువు సోమవారంతో ముగియాలి. పింఛన్ల పంపిణీ, యోగాంధ్ర-2025 కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న కారణంగా ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులను బదిలీల పేరిట డిస్టర్బ్ చేయకూడదని ప్రభుత్వం భావించింది. మరికొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాలేదు. దాంతో బదిలీల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

# రేషన్ పంపిణీని పర్యవేక్షించాలి



రేషన్ సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకూ తావులేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీ ఎస్టీ కృష్ణారెడ్డికాలనీలో 65సంవత్సరాలుపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటివద్దకే అధికారులు, కూటమి నాయకులతో ఎమ్మెల్యే వెళ్లి రేషన్ సరుకులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేవారని, దీంతో కూలీలు తమ పనులను ఆపుకుని రేషన్‌కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దుచేసి రేషన్ డీలర్ల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో సరుకులు అందుబాటులో ఉంటాయని, కార్డుదారులు అనుకూలమైన సమయాల్లో వెళ్లి తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యేను పలువురు నేతలు గజమాలతో సత్కరించి, ఆహ్వానించారు. నాయకులు, రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్, ఎంపీడీవో రామచంద్ర పాల్గొన్నారు.

# అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు కృషి

● ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో గౌరీ శంకర్‌రావు

తిరుపతి(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష తిరుపతి జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు సూచించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రీజనల్ స్థాయి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం స్థానిక జీవకోనలోని విశ్వం పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన గౌరీ శంకర్‌రావు మాట్లాడుతూ తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి 3 నుంచి 5 తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్స్ డైరెక్టర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులకు వారి స్థాయిని అనుసరించి సులభ శైలిలో బోధించాలని, తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. రాష్ట్ర పరిశీలకులు అపర్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సమగ్ర శిక్ష ఏఎస్‌ఓ కేడీ సారథి, చిత్తూరు అసిస్టెంట్ ఏఎంఓ సుభాషిణి, తిరుపతి ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ మీనాక్షి, కేఆర్పీలు, తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఆర్పీలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● భర్త మృతి.. భార్య, అల్లుడి పరిస్థితి విషమం



వెంకటస్వామి (ఫైల్ ఫొటో) - గాయపడిన నారాయణమ్మ, వాసు

కల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతి చెందగా.. భార్య, అల్లుడి పరిస్థితి విషమంగా మారింది. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చిగరమాకులపల్లెకు చెందిన వెంకటస్వామి (70), నారాయణమ్మ దంపతులు ఆదివారం మండలంలోని పాతపేట పంచాయతీ పూరేడువాండ్లపల్లెలోని తమ కుమార్తె ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం అల్లుడు వాసు తన ద్విచక్రవాహనంపై అత్తమామలను ఎక్కించుకుని వారి స్వగ్రామంలో వదిలేందుకు బయల్దేరాడు. కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై వెళుతుండగా వీరి వాహనాన్ని అరుణాచలం వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటస్వామి మృతిచెందాడు. నారాయణమ్మ, వాసు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. వెంకటస్వామి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## హ్యాండ్ బ్రేక్ లాగడంతో బోల్తా పడ్డ కారు

● సురక్షితంగా బయటపడ్డ కుటుంబ సభ్యులు



పిచ్చాటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి వద్ద సోమవారం సాయంత్రం చెన్నై నుంచి నగరికి వెళుతున్న కారు బోల్తా పడింది. అయితే అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. నగరి మండలం చింతలపట్టెడవాసులు బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా కీళపూడి వద్ద కారులో ప్రయాణిస్తున్న బాలుడు హ్యాండ్ బ్రేక్ లాగాడు. దీంతో కారు బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశా రు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కారు డ్రైవర్‌ని మందలించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించి పంపించారు.

## గ్రామదేవత ఊరేగింపులో అపశ్రుతి

● విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు

ఓజిలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో గ్రామదేవత ముంగమూరమ్మ ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. ముంగమూరమ్మ ఉత్సవాలను పురస్కరించు కుని సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఉత్సవ రథానికి వీధిలో విద్యుత్ తీగలు తగలడంతో తెగిపడి పోయాయి. అదే సమయంలో గ్రామ దేవతకు హారతి, నైవేద్యం సమర్పిస్తున్న గౌరి, ఆమె భర్త నాగూరయ్య, అతని కుమారుడు, మరో ఇద్దరు బంధువులు విద్యుదాఘాతానికి గురయ్యారు. గాయ పడిన వారిని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. వీరిలో గౌరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### బోనమందకు

## మళ్లీ ఏనుగుల గుంపు

సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలానికి ఏనుగుల గుంపు మళ్లీ చేరుకున్నట్లు బోనమంద రైతులు తెలిపారు. రెండ్రోజుల కిందట మండలాన్ని ఒంటరి ఏనుగు వీడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం గుంపు రావడంతో భయపడుతున్నారు. పేటూరు, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె తదితర పంచాయతీల్లో వేల ఎకరాల్లో మామిడి, టమోటా పంటలు సాగులో ఉన్నాయి. ప్రస్తుతం మామిడి కోతలు చేయాల్సి ఉండగా, టమోటా కోతలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తోటల్లోకి ఎక్కడ ఏనుగులు వస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## స్వల్పంగా పెరిగిన టమోటా ధరలు



సోమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టమోటాకు రెండు నెలలుగా ధరల్లేని విషయం తెలిసిందే. సోమవారం పుంగనూరు, పలమనేరు మార్కెట్లులో 15 కిలోల బాక్సు రూ.150 నుంచి రూ.180 వరకు చేరుకుంది. శనివారం వరకు 15కిలోల టమోటా బాక్సు ధర రూ.70లోపు ఉండింది. కొందరు రైతులు గిట్టుబాటు ధరలేక కూలీ కూడా రాదని కోతలు ఆపేశారు. ఈ పరిస్థితుల్లో మహారాష్ట్రలో భారీ వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడికి మన జిల్లా నుంచి టమోటాలు ఎగుమతికి వ్యాపారస్తులు రావడంతో టమోటా ధరలు స్వల్పంగా పెరిగాయి. ఈ ధరైనా నిలకడగా ఉంటే కోతలు చేయవచ్చుని రైతులు చెబుతున్నారు.

### నాటుబాంబు తొక్కి

## గాయపడ్డ వేటగాడు



ఛిద్రమైన వినాయకం కాలు

బంగారుపాళ్యం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాటుబాంబును ప్రమాదవశాత్తూ తొక్కడంతో అది పేలి.. ఓ వేటగాడు గాయపడ్డాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని పులిమడుగుకు చెందిన బాలకృష్ణ కుమారుడు వినాయకం అటవీ జంతువులను వేటాడటానికి తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం నుంచి నాటుబాంబులు తీసుకొచ్చేవాడు. ఇలా తీసుకొచ్చిన వాటిని తన ఇంటి ప్రాంగణంలోని పూలచెట్లలో భద్రపరిచేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం పూలచెట్ల పరిసరాల్లో కుక్క తచ్చాడుతుండగా గమనించాడు. దాన్ని తరమడానికెళ్లి ప్రమాదవశాత్తూ అక్కడున్న నాటుబాంబును తొక్కడంతో అది పేలింది. కుడికాలు పూర్తిగా ఛిద్రమైంది. స్థానికులు అతడిని తొలుత బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత మెరుగైన వైద్య నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీఆర్వో హేమచంద్ర ఇచ్చిన ఫిర్యాదుతో వినాయకంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### యోగా కార్యక్రమానికి హాజరుకండి

భాకరాపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో బుధవారం జరిగే యోగా కార్యక్రమానికి చిన్నగొట్టిగల్లు మండలంలో యోగాపై ఆసక్తి ఉన్న వారందరూ పాల్గొనాలని ఎంపీడీవో గిడ్డయ్య కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో

## తాపీ మేస్త్రీ దుర్మరణం

వెదురుకుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ మేస్త్రీ దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీ వేపేరి గ్రామానికి చెందిన ఎం.నాగూర్ శెట్టి కుమారుడు ఎం.గోపి(25) తాపీ మేస్త్రీ. సోమవారం సాయంత్రం వెదురుకుప్పం వైపు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా ఇదే మండలంలోని పాతగుంట వద్ద పెనుమూరు వైపు నుంచి పుత్తూరుకు వెళుతున్న పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సు, బైక్ ఢీకొన్నాయి. గోపి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# పారదర్శకంగా టీచర్ల పదోన్నతి, బదిలీలు: ఆర్జేడీ



ఎంఈవోలకు సూచనలు ఇస్తున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీచర్ల పదోన్నతి, బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న టీచర్ల బదిలీలు, పదోన్నతులు, నాన్ టీచింగ్ స్టాఫ్ బదిలీల ప్రక్రియ పరిశీలన నిమిత్తం సోమవారం జిల్లాకు వచ్చారు. తొలుత డీఈవో వరలక్ష్మితో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఎంఈవోలతో సమావేశం నిర్వహించిన ఆయన స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు లెక్కలు తేల్చాలని సూచించారు. త్వరలో ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కడా పొరబాట్లు లేకుండా అన్ని ఖాళీలు గుర్తించాలని సూచించారు.

### టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

బదిలీలు, పదోన్నతుల్లో వివిధ కారణాలతో నష్టపోయిన టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్జేడీ భరోసా ఇచ్చారు. ఆయా అంశాలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. యూటీఎఫ్ నేతలు రమణ, మణిగండన్ తదితరులు ఆర్జేడీని కలిసి పలు సమస్యలు ప్రస్తావించారు. టీటీడీ ఉద్యోగులు స్పౌజ్ వారికి పాయింట్లు వర్తింప చేయాలని, తొట్టంబేడు మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం మార్పును సవరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు పొందిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలతో పాయింట్లు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. సంఘం నేతలు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, దక్షిణామూర్తి, శేఖర్, మహేష్, వాసు, తదితరులున్నారు.

### మోడల్ స్కూల్ హెచ్ఎంల జాబితా ఖరారు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 950 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉండగా, 600 చోట్ల హెచ్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం వెయ్యి మంది విల్లింగ్ ఇవ్వగా, సోమవారం 358 మందితో జాబితా ఖరారైంది. వీరిలో 288 మందికి ఆర్డర్స్ వచ్చాయి. మిగిలిన వారికి రావాల్సి ఉంది.

## యోగాంధ్ర ప్రారంభం



యోగాసనాలు చేస్తున్న ప్రజలు

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నగరపాలక సంస్థ, తుడా, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో 15 రోజుల యోగ కార్యక్రమాన్ని స్థానిక ఇందిరా మైదానంలో సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా తుడా కార్యదర్శి డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ప్రాతినిథ్యం వహించాలని కోరారు. ఉదయం 6-7.30గంటల మధ్య ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు కైలాస సింగ్, రాజ్‌పురోహిత్, భారత స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు ఓటేరి కృష్ణ, ప్రభాకర్, తంగరాజు, హరి, సంకల్ప సోమేశ్వర్, రవి, ఉమా, గంగాధరం పాల్గొన్నారు.

## పసుపులేటికి ఎమ్మెల్యే అభినందనలు



తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ లేపాక్షిభవన్‌లో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సోమవారం ఉదయం డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువకప్పి సన్మానించి, అభినందించారు. హరిప్రసాద్ నేతృత్వంలో హస్తకళల అభివృద్ధి సంస్థ మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ కుటుంబ సభ్యులతోపాటు జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సానె శీనురాయల్ పాల్గొన్నారు.

## డిస్కం సీఎండీకి అభినందనలు



సంతోషరావును అభినందిస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించిన సీఎండీ కె.సంతోషరావుకు సీఐటీయూ నేత కందారపు మురళి సోమవారం అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు చర్చలు జరపడంతో మొదటి విడతలో రూ.10 లక్షల ఇన్సూరెన్స్ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచారని తెలిపారు. వాచ్‌మెన్ల నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ పొందిన వారికి షిఫ్ట్ ఆపరేటర్ల వేతనాలు చెల్లించాలని కోరారు. వారికీ న్యాయం జరిగేలా చూస్తామని సీఎండీ హామీ ఇచ్చారని తెలిపారు. పీఆర్సీ అనంతరం కార్మికులకు బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎండీని కలసిన వారిలో సీఐటీయూ. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఉన్నారు.

## సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎం బాధ్యతల స్వీకరణ



రామ్మోహనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 2(ఆటోనగర్): సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎంగా కె.రామ్మోహనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంస్థకు ఆర్థిక శాఖ కీలకమైందన్నారు. పదవికి న్యాయం చేసేలా పనిచేస్తానన్నారు. అనంతరం పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మురళికుమార్, సురేంద్రరావు, శ్రీకాంత్, మధుసూదన్, ప్రశాంతి, శైలజ, పుల్లా బాలాజీ, వినకోటి చంద్రశేఖరరావు, ఆంజనేయులు, ముని ప్రసాద్, జయప్రకాష్, భాస్కర్‌నాయుడు, జీఎం నీలం నరేంద్రనాథ్, ఈఈ టెక్నికల్ వాసవీలత ఉన్నారు.

## టీబీ నివారణపై అవగాహన కల్పించాలి



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2(ఆంధ్రజ్యోతి): టీబీ నివారణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా కుష్టు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీబీకి సంబంధించి స్థిరమైన లక్ష్యాలను సాధించే ప్రయత్నాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 2(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సదరన్ డిస్కం విద్యుత్ విజిలెన్స్ అధికారి జనార్దన్‌నాయుడు సూచించారు. సోమవారం సదరన్ డిస్కం కార్యాలయంలో తిరుపతి టౌన్ డివిజన్ ఆపరేషన్ విభాగం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పెనుగాలులు, వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడితే ప్రాణనష్టం జరగకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంత ప్రాణనష్టం తగ్గే అవకాశముంటుందని తెలిపారు.

## బర్డ్ డైరెక్టర్ జగదీష్‌కి అభినందన



జగదీష్‌ని అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి(గాంధీరోడ్డు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ని సోమవారం రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్)ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. గతంలో డైరెక్టర్‌గా పనిచేసి బర్డ్‌కి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, తిరిగి బాధ్యతలు చేపట్టడంతో పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## భావనారాయణకు సన్మానం



భావనారాయణను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ భాస్కరుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీటీడీ వైఖానస ఆగమ సలహాదారుగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయ వైఖానస ఆగమ విభాగ అధ్యాపకులు పరాశరం భావనారాయణ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆ వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు సన్మానించారు. శ్రీవారి ప్రసాదాలను అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

- నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు నిందితులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటకు చెందిన వల్లపు నవీన్, మల్కాజ్‌గిరికి చెందిన శివకుమార్ కర్ణాటక బ్రాండు మద్యం తక్కువ ధరకు తెప్పించుకుని ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. సోమవారం తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు సమాచారం వచ్చింది. ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో వెళ్లి వారిని అరెస్టు చేసి, 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వే స్టేషన్ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చిత్తూరు జిల్లా పెద్దపంజాణికి చెందిన గడ్డి సుబ్రహ్మణ్యం, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేశారు.

## వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- మాజీ సర్పంచ్ గణపతినాయుడు

తిరుపతి(జీవకోన), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎదుటి వ్యక్తిపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని పద్మావతీపురం మాజీ సర్పంచ్ గణపతినాయుడు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 9 నెలల క్రితం నారాయణరాజు అనే వృద్ధుడు తన వద్దకు వచ్చి 3 ఎకరాల భూమిని కొనుగోలు చేయాలని రికార్డులు చూపించారన్నారు. అందులో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తే భూమిలో వాటా ఇస్తానని నారాయణరాజు ఒప్పంద పత్రం రాసుకుని రావడంతో తాను అంగీకారం తెలిపానన్నారు. అయితే సదరు భూమిని ఆరు నెలల కిందటే ఆయనకు తిరిగి ఇచ్చేశానన్నారు. కొంతమంది ఇది తెలుసుకోకుండా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తాను సెటిల్‌మెంట్లు చేసి కోట్లు సంపాదించానని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రదీప్ రెడ్డి, పిపాసి, రాజేంద్ర, వైస్ సర్పంచ్ గోపాల్, సునీల్, శ్రీనివాస్, రఘు, చిన్ని, మునిశేఖర్ రాయల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 81 వినతులు



వినతులను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం) జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 81 మంది హాజరై సమస్యలకు సంబంధించిన వినతులు ఇచ్చారు. వినతులు తీసుకున్న పోలీసు అధికారులు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని ఆయా స్టేషన్లకు పంపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తిరుపతి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో తిరుపతికి చెందిన పలు విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

### నారాయణ విద్యార్థుల విజయ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం కొండలరావు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నారాయణ విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించారని డీజీఎం కొండలరావు పేర్కొన్నారు. స్థానిక న్యూబాలాజీ కాలనీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ భానుచరణ్‌రెడ్డి ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో 4వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 51వ ర్యాంకు సాధించాడని చెప్పారు. మణిదీప్‌రెడ్డి 345, హిమేష్ రాఘవచంద్ర 468, శశాంక్‌రెడ్డి 618, యశ్విత 906, నిఖిల్ 1,056 ర్యాంకులతోపాటు వంద లోపు 1, వెయ్యిలోపు 5, 5వేలలోపు 16, 10వేలలోపు 27 ర్యాంకులు ఓపెన్ కేటగిరీలో సాధించారని వివరించారు. అన్ని కేటగిరీల్లో కలిపి 150 మంది ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించనున్నారని చెప్పారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్‌కుమార్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ఉదయ్, అభిషేక్, ఏజీఎం గోపిలతో కలిసి అభినందించారు.

### శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య అధ్యాపక బృందం

శ్రీచైతన్య విద్యార్థులు వివిధ విభాగాల్లో మంచి ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల తిరుపతి జోన్ ఏజీఎం బీవీ ప్రసాద్ చెప్పారు. సాయిముఖేష్ 115వ ర్యాంకు, మునికృష్ణ 228, అశోక్‌నాయక్ 542, భరత్ 847, సహస్ర 1202, కుళ్లాయప్ప నాయక్ 1,335, మోక్షిత్‌శర్మ 1,371, జ్ఞానసాత్విక్ 1,625, అమూల్య 1,830, అభిరామ్ సాయి 2,017, గంగా మనోజ్‌కుమార్ 2,333, మణి 2,453, జ్ఞానదీక్షిత 3,450, ఎన్ భానుప్రకాష్ 3,992, జీవన్‌కుమార్ 4,099, కార్తికేయ 4,696, కావ్య 4,698, వరుణ్‌తేజ్ 5,161, హేమంత్ చౌదరి 5,189, మణీష్ 5,263, బారు ఆకాష్ 5,832 వంటి ర్యాంకులతోపాటు అన్ని కేటగిరీల నుంచి 42 మంది ఐఐటీల్లో సీట్లు పొందగలిగే ర్యాంకులు పొందారని చెప్పారు. విద్యార్థులను బీవీ ప్రసాద్‌తోపాటు డీన్‌లు కేఎల్జీ ప్రసాద్, రామమోహనరావు, శ్రీనివాసరాజు, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

### శ్రీధర్స్ అకాడమీ విజయ దుందుభి



ఎం.మహేష్, టి.హరజిత్, పి.నిఖిలేశ్వర్

ఎయిర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ ఐఐటీ - జేఈఈ, నీట్ అకాడమీ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. మహేష్ 114వ ర్యాంకు, హరజిత్ 1,505, నిఖిలేశ్వర్ 3,312, హర్ష 7,214, లీపిత 9,750 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. అలాగే 5వేలలోపు 3, 10 వేలలోపు 5 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్టు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

### అశ్వమేధ విద్యార్థుల విజయం




విద్యార్థులతో అశ్వమేధ డైరెక్టర్లు ఇష్రత్, గోవర్ధన్

ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం గోవర్ధన్ పేర్కొన్నారు. 15 మంది విద్యార్థులకుగాను 9మంది ర్యాంకులు సాధించారని వెల్లడించారు. వివిధ కేటగిరీల్లో నిఖిల్ 287, సిద్ధార్థ్ 2,095, యశశ్రీ 2,755, శ్రీవైష్ణవి 3,872, సుభద్ర సాహితి 4,011, వెంకటరెడ్డి 4,627, రేవంత్ 4,530, వెంకట్‌సాయి 4,699, శ్రీహరి 180 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సుమతి, రామయ్య, పలువురు అధ్యాపకులతో కలిసి ఆయన అభినందించారు.

# బక్రీద్‌కు ఈద్గాను సిద్ధం చేయండి



చరణ్‌తేజ్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఎస్కే బాబు, ముస్లింలు

తిరుపతి, జూన్2(ఆంధ్రజ్యోతి) : బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో తగిన సౌకర్యాలు కల్పించాలని ముస్లింలతో కలిసి జనసేన కార్పొరేటర్ ఎస్కే బాబు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈద్గా మైదానంలో గతంలో చేసిన విధంగా సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన సిఫార్సు లేఖను కూడా జతచేశారు. ఈ నెల ఐదో తేదీ లోపు పనులు పూర్తి చేసి ఇవ్వాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఆటోనగర్‌లోనూ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

### పీజీఆర్‌ఎస్‌కు 23 వినతులు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 23 వినతులు వచ్చాయి. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఫోన్ ద్వారా నలుగురు తమ సమస్యలు తెలుపగా, 19 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఎస్ఎల్వీ నగర్‌లో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని, 6, 7 వార్డుల్లో మెప్మా సంఘాలు జరిపేందుకు గదులు కేటాయించాలని, కేబీ లేఔట్‌లో ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని, యూడీఎస్ ఓవర్ ఫ్లో అరికట్టాలని, టీడీఆర్ బాండ్ ఇప్పించాలని, ఎమ్మార్‌పల్లె వద్దగల మాస్టర్ ప్లాన్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, ఫైర్ డీఈలు, ఏసీపీలు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## రవీంద్రరాజు వ్యాఖ్యలు సరికాదు

- వీఆర్వోల సంఘ నేతలు

తిరుపతి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేరిట భూపతిరాజు రవీంద్రరాజు చేస్తున్న అనాలోచిత, అసంబద్ధ, మోసపూరిత వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోబోమని సంఘ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పుల్లూరు రాఘవరెడ్డి, వీఆర్వోలు పత్తిపుత్తూరు రమేష్, ఎం.సుమన్, ఏపీసతీష్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. విశాఖ జిల్లా వేదికగా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో వ్యాఖ్యలను పలు పత్రికలు రకరకాలుగా ప్రచురించాయని తెలిపారు. కొందరు స్వార్థపూరిత ఆలోచనలతో వీఆర్వోల సంఘాన్ని చిన్నాభిన్నం చేసి, గత ప్రభుత్వ పాలకుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నారని విమర్శించారు. కాగా తమ సంఘ పేరు, రిజిస్ట్రేషన్ నంబరును అడ్డుపెట్టుకుని భూపతిరాజు రవీంద్రరాజు స్వయం ప్రకటిత అధ్యక్షుడిగా చేసిన అడ్డగోలు వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు.

## ఫ్లెక్సీల సంస్కృతిని అరికట్టండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 2(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రోజురోజుకూ ఫ్లెక్సీల సంస్కృతి పెరుగుతోందని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, అరికట్టాలని సీపీఎం నేత కందారపు మురళి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరానికి రోజుకు లక్ష మందికి పైగా భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని, ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, చివరకు రౌడీలు కూడా తమ అనుచరుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.







గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన సోమవారం రాత్రి స్వామి వారు పెద్దశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. వాహన సేవ ముందు కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## 8న తిరుపతిలో 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక!

### సినీ దిగ్గజాలు చిరంజీవి, రజనీకాంత్ రాక

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుక ఈనెల 8న తిరుపతి ఎస్వీయూ తారక రామ మైదానంలో జరగనున్నట్లు సమాచారం. ఈ మేరకు అనుమతి కోసం చిత్రనిర్మాత ఏఎం రత్నం ఎస్వీయూ వీసీకి లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యఅతిథులుగా తెలుగు, తమిళ సినీ దిగ్గజాలు మెగాస్టార్ చిరంజీవి. సూపర్‌స్టార్ రజనీకాంత్, పవన్‌కల్యాణ్‌తో పాటు నటీనటులు నిధిఅగర్వాల్, బాబిడియోల్, సత్యరాజ్, మరో నిర్మాత దయకర్‌రావు హాజరు కానున్నట్లు సమాచారం. వీరంతా ఈవెంట్ ముగిశాక రాత్రికి తిరుమల చేరుకుని, మరుసటి రోజు ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం.


సంజయ్ మూర్తి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సంజయ్ మూర్తి, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటుడు శుభలేఖ సుధాకర్, ఆయన సతీమణి, గాయని ఎస్పీ శైలజ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


శుభలేఖ సుధాకర్, శైలజ


## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్‌లో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.46 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,031

తలనీలాలు సమర్పించినవారు: 32,936





# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు

● జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జేఈఈ మెయిన్స్‌లో ఎంపికైన సుమారు వెయ్యి మంది ఈ పరీక్ష రాశారు. పలువురు జాతీయ స్థాయిలో ఉన్నత ర్యాంకులు పొందారు. తమ మనోభావాలను వారు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

### ఏఐలో రీసెర్చ్ చేస్తా



ఐఐటీ ముంబైలో సీటు సాధించి సీఎస్ఈ చదివి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో రీసెర్చ్ చేయాలనేది నా ఆశయం. ఇందుకోసం కళాశాల అధ్యాపకులు ఎన్‌సీఆర్టీ పుస్తకాలను సమగ్రంగా అధ్యయనం చేయించారు. ఓల్డ్ పేపర్స్ ప్రాక్టీస్ చేయించారు. కళాశాలలో మాక్‌టెస్టులు, రివిజన్‌వల్ల సబ్జెక్ట్‌పై పట్టు వచ్చింది. అధ్యాపకుల సూచనల మేరకు చదువుతూ, సాధన చేశా. మా నాన్న జైభారత్, (ప్రైవేట్ కాలేజీలో గణిత అధ్యాపకుడు), అమ్మ సురేఖ ఎంతగానో ప్రోత్సహించారు.

- ఎం.భానుచరణ్‌రెడ్డి, ఓపెన్ కేటగిరిలో 51, ఈడబ్ల్యుఎస్ 4వ ర్యాంకు

### ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ చదువుతా



ప్రతిష్ఠాత్మక ఖరగ్‌పూర్, చెన్నై ఐఐటీల్లో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, నాన్న గిరిజా ప్రసాద్‌రెడ్డి స్ఫూర్తితో, అగ్రికల్చరల్ కళాశాల ప్రొఫెసర్ అయిన అమ్మ అమరావతి ప్రోద్బలంతో ఇంజినీరింగ్ వైపు అడుగులు వేశాను. మా కళాశాల అధ్యాపకులు సూచించిన మేరకు చదివి ఉత్తమ ర్యాంకు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది.

- దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి, 345వ ర్యాంకర్.

### మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చేస్తా



మద్రాస్ ఐఐటీలో సీఎస్ఈ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరడాలనేది నా కోరిక. నాన్న నాగేంద్ర (వెటర్నరీ డాక్టర్) నాగేంద్ర, అమ్మ జ్యోతి ప్రోద్బలంతో కష్టపడి చదివా. మా అధ్యాపకుల శిక్షణ, ఎన్‌సీఆర్టీ సిలబస్ అధ్యయనం, కళాశాలలో మాక్ టెస్టులు నన్ను నేను తీర్చిదిద్దుకునేందుకు ఎంతగానో ఉపకరించాయి.

- జి.హిమేష్ రాఘవచంద్ర, 468వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 61వ ర్యాంకు.

### టాప్ 5 ఐఐటీల్లో చదవాలన్నది లక్ష్యం



దేశంలోని టాప్ ఐదు ఐఐటీల్లోని ఒకదానిలో సీఎస్ఈ చదవాలనేది నా లక్ష్యం. కష్టపడి చదివి మంచి ర్యాంకు తెచ్చుకోవడంతో నా లక్ష్యం నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉంది. నాన్న ప్రహ్లాద్ రెడ్డి (ప్రైవేట్ స్కూల్ టీచర్), అమ్మ రెడ్డిరాణి నన్ను కష్టపడి చదివించారు. మా కళాశాల అధ్యాకుల బోధన, వారి అత్యుత్తమ ప్రణాళిక నన్ను ఈ విజయబాటలో నడిపింది.

- ఎం.శశాంక్, 618వ ర్యాంకర్

### ఐఐటీ ముంబైలో చదువుతా



మా కళాశాల అధ్యాపకుల నేతృత్వంలో ముంబై ఐఐటీలో సీటు సాధించాలనే పట్టుదలతో చదివాను. నాన్న కె.నాదముని రెడ్డి (కెమిస్ట్రీ లెక్చరర్), అమ్మ ఎం.బిందు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

- కళత్తూర్ యశ్విత, 906వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్‌లో 67వ ర్యాంకు

### గూడూరు విద్యార్థికి 535వ ర్యాంకు


తల్లిదండ్రులతో నితిన్‌రెడ్డి

గూడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఇంటర్ చదివిన గూడూరు విద్యార్థి వేగూరు నితిన్‌రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా 535వ ర్యాంకు వచ్చింది. తండ్రి రవిచంద్రారెడ్డి (టీచరు), తల్లి సుచిత్ర (వెల్ఫేర్ అసిస్టెంట్), అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకును సాధించానని, ప్రతిష్ఠాత్మక ఐఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా రాణించాలన్నదే లక్ష్యమని చెప్పారు.

## నేడు సీనియర్ పురుషుల క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ మెన్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సీడీసీఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవి ఓ ప్రకటనలో తెలిపారు. వాల్మీకిపురం, తిరుపతి, చిత్తూరు, మదనపల్లె క్రికెట్ మైదానాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రి, ఆధార్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

# వినుడు.. మా గోడు

## కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 299 వినతులు ● రెవెన్యూ శాఖవే 158

● సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చూపొద్దన్న కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమ గోడు పట్టించుకుని, సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు తరలివచ్చారు. వీరితో కలెక్టరేట్ కిక్కిరిసింది. వివిధ సమస్యలపై 299 అర్జీదారులు అందగా, అందులో 158 రెవెన్యూశాఖవే కావడం గమనార్హం. ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని, ఇందులో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు. పరిష్కరించలేని అర్జీకు వాటిపై ఫిర్యాదుదారులకు కారణాలు చెప్పాలన్నారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా, పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలవడానికి వచ్చే అర్జీదారులను ఒక క్రమ పద్ధతిలో సమావేశ మందిరంలోకి అనుమతించాలి. జీఎస్ డబ్ల్యూ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహంతో కలెక్టర్ కోసం ఒకటి.. ఇతరుల మరొకటి అంటూ రెండు లైన్లలో పంపడంతో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈ విషయం తెలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహించడంతో ఒక లైనులోనే అనుమతించారు.

### తోతాపురికి గిట్టుబాటు ధర కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామానాయుడు, రైతు సంఘ నాయకులు

మామిడిలో ఎక్కువగా తోతాపురి రకం అధిక దిగుబడి వస్తుందని, గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేయాలని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. తోతాపురి రకానికి సరైన ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ రకం మామిడిని పండించడానికి టన్నుకు రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చవుతోందని చెప్పారు. కాబట్టి టన్నుకు రూ.30వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టేబుల్ వెరైటీలను రైతు బజారులో ప్రభుత్వం ద్వారా విక్రయించి కనీస ధర ఉండేలా చూడాలన్నారు. మామిడి పల్స్‌ను దేవాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, గోపాల్‌రెడ్డి, హేమలత, వెంకయ్య, పద్మనాభం, అయ్యప్పనాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ నేత మా భూమి ఆక్రమించారు

మా పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేత సురేష్‌రెడ్డి ఆక్రమించాడు. అందుకు రెవెన్యూ వాళ్లు సహకరించారు. ప్రభుత్వం మారింది. మా భూమిని మాకు ఇప్పించి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మహేష్, అలిమిలి గ్రామం

### శ్మశాన వాటికను ఏర్పాటు చేయండి



తిరుపతి అర్బన్ తిమ్మినాయుడు పాలెం హరిజనవాడలో 4 వేలు కుటుంబాలకు శ్మశాన వాటిక లేక ఇబ్బందిగా ఉందని ఏపీ అంబేడ్కర్ యువజనసంఘం నేత వెంకటరత్నం అన్నారు. 2018లో గ్రామానికి ఉత్తరం వైపున నిరుపయోగంగా ఉన్న అటవీ శాఖ భూమిని కేటాయించాలని అప్పటి జిల్లా అధికారులు ఆదేశించారన్నారు. ఇప్పటికీ శ్మశాన వాటిక కోసం స్థలం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.

### ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి అర్బన్ మండలం వేణుగోపాల్ కాలనీలో వారం కిందట ఇళ్లను కూల్చివేసిన వారిపై కఠిన కేసులు నమోదుచేసి బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయమున్న రాజన్‌బాబు, నిర్మల, రమణారెడ్డి, చంద్రగిరి మస్తాన్, మునిరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదం ఉన్న స్థలాలను మోసం చేసి అమ్మిన రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి వర్గ సభ్యులు మాధవ, బుజ్జి, బాధితులు వెంకటేష్, శ్రీరాములునాయక్, రిషిరెడ్డి, శివమణి, వెంకటేష్, పద్మావతి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

### మాపై అక్రమకేసులు

బాలయ్యపల్లి మండలం సరిహద్దు, వెంకటగిరి మండలం సరిహద్దు వద్ద మర్ధనంపల్లెలో పూర్వీకుల నుంచి మా అధీనంలో భూములను సాగుచేసుకుంటున్నారు. శ్రీకాళహస్తికి చెందిన కొంతమంది ఆ భూమికి కంచె వేస్తుంటే అడ్డుకున్నాం. మాపై అకారణంగా ఎస్ఐ సహకారంతో అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తుల ద్వారా తప్పుడు కేసులు బనాయించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి.

- వెంకటేశ్వర్లు. అక్కసముద్రం, బాలయపల్లి

### ఉపాధి కల్పించండి



సారూ.. మాకు ఏడేళ్ల కిందట వివాహమైంది. నేను, నాభర్త దివ్యాంగులం. మాకు ప్రభుత్వం తరపున దివ్యాంగుల కోటలో జీవనోపాధి కల్పించి ఆదుకోవాలి. పూట గడవడానికికూడా కష్టంగా ఉంది.

- మయూరి, ప్రదీప్, పేరూరు, తిరపతి రూరల్ మండలం

### ప్రభుత్వ భూములు విక్రయిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన డీటీ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి భూఆక్రమణలకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.



### ఆదుకుంటామని చేతులెత్తేశారు

ఇటీవల ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని ఓ కంపెనీలో భవన నిర్మాణం పనిచేస్తుండగా కటింగ్ మిషన్‌తో కాలు తెగిపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొంది కూలీపనులకు వెళ్లలేక ఇంటికే పరిమితమయ్యా. అప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కంపెనీ నిర్వాహకులు ఇప్పుడు పట్టించుకోవడంలేదు. నాకు న్యాయం చేయండి.

- విజయకుమార్, మేస్త్రీ, రేణిగుంట

# పోలీసుల అదుపులో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ల చోరీల ముఠా

● ఎనిమిది మంది నిందితుల అరెస్టు


మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మంలంలో గత ఏడాది నుంచి రైతుల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌పార్మలర్లు, మోటర్లు, స్టార్టర్లు, కేబుల్‌వైర్లు చోరీ చేసే ముఠాను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌పార్మర్లు, స్టార్టర్లలో రాగి వైరు, బోరులో కేబుళ్ల చోరీపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, గాజులమండ్యం ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. ఏర్పేడు, గాజులమండ్యం పోలీసులు ఏర్పేడు మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న టీసీఎల్ పరిశ్రమ వద్ద సోమవారం తెల్లవారజామున ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన వెంకట్రామయ్య, కత్తి మణి, జండా వెంకటేష్‌ను స్టేషన్‌కు తరలించారు. వారు చోరీ చేసిన రాగివైరు, బోరు కేబుళ్లను కొనుగోలు చేసిన తిరుపతికి చెందిన ఎస్కే ఖాదర్‌బాషా, సయ్యద్, హుస్సేన్, షేక్ బషీద్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన షేక ఉస్మాన్, వెంకటగిరికి చెందిన గోపాలకృష్ణను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మీడిమా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిది మంది నిందితుల నుంచి 795 కిలోల రాగివైర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# సత్యసాయి జిల్లాకు శివప్రసాద్

● నాన్ ఫోకల్ పోస్టు ఇవ్వాలని ఉత్తర్వు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో రేణిగుంట, కడప రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ అవినీతి ఆరోపణలతో సస్పెండైన సిద్దాల శివప్రసాద్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కడప రూరల్ తహసీల్దార్‌గా ఉన్న సమయంలో గత ఏడాది ఏప్రిల్ 8న ఏసీబీకి చిక్కి సస్పెండయ్యారు. సస్పెండైన ప్రభుత్వ ఉద్యోగికి ఏడాది తర్వాత పోస్టింగ్ ఇవ్వాలన్న నిబంధన మేరకు సదరు అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గత నెల 18న సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. అయితే తిరుపతి అర్బన్ తహసీల్దారుగా కూర్చోవాలని రాజకీయ నాయకులతో ఈయన అధికారులపై ఒత్తిడి చేయించినట్టు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఇతడి వ్యవహార శైలి, వివాదాస్పద పనితీరు తెలిసి అతడ్ని తహసీల్దార్ల కొరత ఉన్న సత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను సవరించింది. అదికూడా నాన్ ఫోకల్ పోస్టులో వేయాలని ఆ జిల్లా కలెక్టర్‌కు సూచిస్తూ, తిరుపతి జిల్లా నుంచి వెంటనే రిలీవ్ చేయయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

# గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వైభవంగా ధ్వజారోహణం


పెద్దశేష వాహనంలో ఉత్సవర్లు

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవర్లు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఆలయానికి వేంచేపుచేసి విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణలు నడమ ఉదయం 7.02-7.20గంటల మధ్య మిథున లగ్నంలో గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివార్లకు ఆస్థానం, స్నపన తిరుమంజనం కావించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి పెద్దశేష వాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.





# ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న చెరువులకు రూ.78.50 లక్షలు

● తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మంజూరు

తిరుపతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గతేడాది ఫెంగల్ తుఫానులో దెబ్బతిన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 78.50 లక్షలు మంజూరు చేసింది. గతేడాది నవంబరు 30వ తేదీ నుంచీ డిసెంబరు 2వ తేదీ నడుమ ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు జిల్లాల్లో పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు దెబ్బతిన్నాయి. వాటి తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 9.54 కోట్ల నిధులు అవసరమని మైనర్ ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల సహాయక నిధుల నుంచీ రూ. 78.50 లక్షలు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు జిల్లాల్లో దెబ్బతిన్న చెరువులను తాత్కాలిక ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ. 9.54 కోట్లు అవసరమవుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి పంపితే ఆరు నెలలు ఆలస్యంగా అది కూడా అరకొర నిధులు మంజూరు చేసింది. జనవరి నుంచీ మే దాకా పెద్దగా వర్షాలు కురిసే ఐదు నెలల పాటు పట్టించుకోకుండా తీరా నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే సమయంలో చెరువుల మరమ్మతులకు నిధులివ్వడం విమర్శలకు దారి తీస్తోంది. వర్షాలు కురిసే సమయంలో చెరువులకు మరమ్మతులు చేయడం ఇబ్బందికరమన్న అంశాన్ని ప్రభుత్వం విస్మరించడం గమనార్హం.

# షార్టు సర్క్యూట్‌తో కారు దగ్ధం

● ఆరుగురు ప్రయాణికులు సురక్షితం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీల్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు పూర్తిగా కాలిపోయిన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక శాఖాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి కథనం మేరకు.. చెన్నైకు చెందిన ఎస్.ధర్మచంద్ కుటుంబ సమేతంగా.. మొత్తం ఆరుగురు కారులో (టీఎన్20బీడీ 6211) తిరుమలకు బయలుదేరారు. తిరుచానూరు రోడ్డులోని పిల్లర్ నెంబరు 28 వద్దకు కారు రాగానే బ్యాటరీలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. కారులోని ఆరుగురు హుటాహుటిన కిందకు దిగేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తిరుపతి అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో మంటలు అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో దాదాపు రూ రెండు లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## గ్రామదేవత ఊరేగింపులో అపశ్రుతి

### విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు

ఓజిలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో గ్రామ దేవత ముంగమూరమ్మ ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. ముంగమూరమ్మ ఉత్సవాలను పురస్కరించు కుని సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఉత్సవ రథానికి వీధిలో విద్యుత్ తీగలు తగలడంతో తెగిపడి పోయాయి. అదే సమయంలో గ్రామ దేవతకు హారతి, నైవేద్యం సమర్పిస్తున్న గౌరి, ఆమె భర్త నాగూరయ్య, అతని కుమారుడు, మరో ఇద్దరు బంధువులు విద్యుదాఘాతానికి గురయ్యారు. గాయ పడిన వారిని చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. వీరిలో గౌరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మామిడికి గిట్టుబాటు ధర ఇవ్వండి

### రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్



మామిడి కాయలను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

బంగారుపాళ్యం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర ఇచ్చి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మామిడి రైతులు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి శంకరన్‌తో కలిసి బంగారుపాళ్యం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం నాటికి మార్కెట్‌లో తోతాపురి రూ.4-5 మధ్య కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ రైతులకు కనీస ధర రూ.25గా నిర్ణయించి, మార్కెట్ యార్డుల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు. వీరివెంట రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, నాయకులు సుబ్రహ్మణ్యం, లోకేశ్, రాజన్న తదితరులున్నారు.

## మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మామిడి గుజ్జు పరిశ్రమలు.. రైతుల నుంచి కాయలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో మామిడి బోర్డు ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇటీవలే కలెక్టర్ చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మామిడి గుజ్జుపరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు.

## రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ దుర్మరణం



గోపి (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ మేస్త్రీ దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీ వేపేరి గ్రామానికి చెందిన ఎం.నాగూర్ శెట్టి కుమారుడు ఎం.గోపి(25) తాపీ మేస్త్రీ. సోమవారం సాయంత్రం వెదురుకుప్పం వైపు నుంచి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా ఇదే మండలంలోని పాతగుంట వద్ద పెనుమూరు వైపు నుంచి పుత్తూరుకు వెళుతున్న పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సు, బైక్ ఢీకొన్నాయి. గోపి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## ఉద్యోగుల బదిలీలకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీవరకు పొడిగించింది. మే 15వ తేదీన ప్రకటించిన షెడ్యూలు ప్రకారం అన్ని శాఖల్లో బదిలీల గడువు సోమవారంతో ముగియాలి. పింఛన్ల పంపిణీ, యోగాంధ్ర-2025 కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్న కారణంగా ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులను బదిలీల పేరిట డిస్టర్బ్ చేయకూడదని ప్రభుత్వం భావించింది. మరికొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తికాలేదు. దాంతో బదిలీల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

## కర్ణాటక మద్యం స్వాధీనం: నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం) జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నలుగురు నిందితులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటకు చెందిన వల్లపు నవీన్, మల్కాజ్‌గిరికి చెందిన శివకుమార్ కర్ణాటక బ్రాండు మద్యం తక్కువ ధరకు తెప్పించుకుని ఇక్కడ విక్రయాలు చేస్తున్నారు. సోమవారం తిరుపతి - తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు సమాచారం వచ్చింది. ఎస్‌ఐ రామాంజనేయులు సిబ్బందితో వెళ్లి వారిని అరెస్టు చేశారు. వారి నుంచి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైల్వే స్టేషన్ వద్ద కర్ణాటక మద్యం వి క్రయిస్తున్న చిత్తూరు జిల్లా పెద్దపంజాణికి చెందిన గడ్డి సుబ్రహ్మణ్యం, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేశారు.

## సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎం బాధ్యతల స్వీకరణ



రామ్మోహనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్), జూన్2(ఆటోనగర్): సదరన్ డిస్కం ఫైనాన్స్ సీజీఎంగా కె.రామ్మోహనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంస్థకు ఆర్థిక శాఖ కీలకమైందన్నారు. పదవికి న్యాయం చేసేలా పనిచేస్తానన్నారు. అనంతరం పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మురళికుమార్, సురేంద్రరావు, శ్రీకాంత్, మధుసూదన్, ప్రశాంతి, శైలజ, పుల్లా బాలాజీ, వినకోటి చంద్రశేఖరరావు, అంజనేయులు, ముని ప్రసాద్, జయప్రకాష్, భాస్కర్‌నాయుడు, జీఎం నీలం నరేంద్రనాథ్, ఈఈ టెక్నికల్ వాసవీలత ఉన్నారు.

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూన్2(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సదరన్ డిస్కం విద్యుత్ విజిలెన్స్ అధికారి జనార్దన్‌నాయుడు సూచించారు. సోమవారం సదరన్ డిస్కం కార్యాలయంలో తిరుపతి టౌన్ డివిజన్ ఆపరేషన్ విభాగం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పెనుగాలులు, వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడితే ప్రాణనష్టం జరగకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంత ప్రాణనష్టం తగ్గే అవకాశముంటుందని తెలిపారు.

### ప్రభుత్వ కార్యాలయాలకు

## ఆగిన విద్యుత్ సరఫరా

### 15 గంటల తరువాత పునరుద్ధరణ

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలోని ప్రభుత్వ కార్యాలయాలకు సోమవారం 15 గంటలపాటు విద్యుత్ ఆగిపోయింది. తహసీల్దారు, ఎంపీడీవో, ఎమ్మార్సీ, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్, వెలుగు, పోలీస్‌స్టేషన్, ఐసీడీఎస్, బాలసదనం, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. సోమవారం మధ్యాహ్నం వరకూ విద్యుత్ రాకపోవడంతో ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉక్కపోత తట్టుకోలేక కొంతమంది కార్యాలయాల బయటకు వచ్చి సేదతీరారు. ట్రాన్స్‌కో అధికారులు ఆలస్యంగా స్పందించి సాయంత్రం నాలుగు గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

## వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - ఎల్‌పి సాగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి జాతీయ రహదారి సమీపంలో వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఎరుపు, నలుపు, తెలుపు, గడుల చొక్కా ధరించి ఉన్నాడు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## మహిళ మెడలో సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడును గుర్తు తెలియని యువకుడు లాకెళ్లాడు. పట్టణంలోని కొత్త బీడీ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రమ్మ ఆదివారం సాయంత్రం గ్రీన్‌సిటీ సమీపంలో వాకింగ్ చేస్తుండగా మోటారు సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని యువకుడు చంద్రమ్మ మెడలో సరుడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## పాముకాటుతో రైతుకు అస్వస్థత

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో సోమవారం పాముకాటుకు గురైన రైతు వెంకటేశ్వర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు పొలంలో వేరుశనగ పంటను పరిశీలిస్తూ వెళ్లుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు గూడూరు ఆస్పత్రికి తరలించారు.

## హత్యాయత్నం కేసు నమోదు

కోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో కుదురు రమణయ్యపై హత్యాయత్నం జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. రమణయ్య కోట బజారుసెంటర్ నుంచి తాను నివాసం ఉంటున్న కోటమ్మగుడి కాలనీకి మోటరు బైక్‌లో వెళ్తుండగా గురుకులం క్వార్టర్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కారం చల్లి హత్యాయత్నం చేయబోయారని, కేకలు వేయడంతో నిందితులు పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో 30ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. మండలంలో అనుమతి లేకుండా నిర్మించుకున్న 360 ఇళ్లను గుర్తించామని, అయితే 80 దరఖాస్తులే అందాయన్నారు. మిగిలినవారు కూడా దరఖాస్తు చేసుకొని తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

## జనసేన వలంటీర్లకు సభ్యత్వ కిట్ల అందజేత

గూడూరు అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీలక వలంటీర్లకు సోమవారం సభ్యత్వ కిట్లు అందజేశారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5లక్షలు, ప్రమాదాలకు లోనైన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందించేలా పార్టీ చర్యలు తీసుకుందని జనసేన నాయకుడు మునిగిరీష్ తెలిపారు.

## యోగాంధ్ర ప్రారంభం

తిరుపతి(క్రీడలు), జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నగరపాలక సంస్థ, తుడా, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో 15 రోజుల యోగ కార్యక్రమాన్ని స్థానిక ఇందిరా మైదానంలో సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా తుడా కార్యదర్శి డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ప్రాతినిథ్యం వహించాలని కోరారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కల్నల్ సతీందర్ దహియ

రామచంద్రాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ అన్నారు. మండలంలోని సి.రామాపురం గ్రామంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆవరణలో సోమవారం 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి సంగీతంతో కూడిన పాటలు పాడిన, విన్న మనసుకు ఆహ్లాదకరంగా ఉంటుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు పాటల పోటీలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్, పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండింగ్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే, కార్యాలయ పర్యవేక్షకులు సురేష్ కుమార్, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్, శిక్షణ అధికారి లక్ష్మీనరసింహ, ఉపేంద్ర పాల్గొన్నారు.

## నాణ్యత, రుచితో పౌష్టికాహారం అందించాలి

చంద్రగిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించడమే మన బాధ్యత అని జిల్లా అధికారి, వీసీ టాటా ట్రస్ట్ అమరావతి అన్నారు. చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకంలో వంట చేసే కార్మికులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఎంఈవో భాస్కర్‌బాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. లోపాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి, కార్మికులకు బహుమతులు ప్రదానం చేశారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న అమరావతి, భాస్కర్‌బాబు

## పసుపులేటికి ఎమ్మెల్యే అభినందనలు



హరిప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆరణి బృందం

తిరుపతి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ లేపాక్షిభవన్‌లో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సోమవారం ఉదయం డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువకప్పి సన్మానించి, అభినందించారు. హరిప్రసాద్ నేతృత్వంలో హస్తకళల అభివృద్ధి సంస్థ మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ కుటుంబ సభ్యులతోపాటు జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, శీనురాయల్ పాల్గొన్నారు.

## తుఫాన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు సంభవించినప్పుడు అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలి.. తదితర అంశాలపై డివిజన్ స్థాయి అధికారులతో ఆర్డీవో కిరణ్మయి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల అధికారులు నిత్యం ప్రజలతో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఏవో రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య, సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట తహసీల్దార్లు నరసింహారావు, శరత్‌బాబు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా టీచర్ల పదోన్నతి, బదిలీలు: ఆర్జేడీ



ఎంఈవోలకు సూచనలు ఇస్తున్న ఆర్జేడీ శామ్యూల్

చిత్తూరు సెంట్రల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీచర్ల పదోన్నతి, బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ స్పష్టం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరుగుతున్న టీచర్ల బదిలీలు, పదోన్నతులు, నాన్ టీచింగ్ స్టాఫ్ బదిలీల ప్రక్రియ పరిశీలన నిమిత్తం సోమవారం జిల్లాకు వచ్చారు. తొలుత డీఈవో వరలక్ష్మితో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఎంఈవోలతో సమావేశం నిర్వహించిన ఆయన స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు లెక్కలు తేల్చాలని సూచించారు. త్వరలో ఎస్టీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కడా పొరబాట్లు లేకుండా అన్ని ఖాళీలు గుర్తించాలని సూచించారు.

**టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

బదిలీలు, పదోన్నతుల్లో వివిధ కారణాలతో నష్టపోయిన టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్జేడీ భరోసా ఇచ్చారు. ఆయా అంశాలను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. యూటీఎఫ్ నేతలు రమణ, మణిగండన్ తదితరులు ఆర్జేడీని కలిసి పలు సమస్యలు ప్రస్తావించారు. టీటీడీ ఉద్యోగులు స్పౌజ్ వారికి పాయింట్లు వర్తింప చేయాలని, తొట్టంబేడు మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం మార్పును సవరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు పొందిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సమస్యలతో పాయింట్లు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. సంఘం నేతలు సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, దక్షిణామూర్తి, శేఖర్, మహేష్, వాసు, తదితరులున్నారు.

**మోడల్ స్కూల్ హెచ్‌ఎంల జాబితా ఖరారు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 950 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉండగా, 600 చోట్ల హెచ్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం వెయ్యి మంది విల్లింగ్ ఇవ్వగా, సోమవారం 358 మందితో జాబితా ఖరారైంది. వీరిలో 288 మందికి ఆర్డర్స్ వచ్చాయి. మిగిలిన వారికి రావాల్సి ఉంది.

## లింగ నిర్ధారణ పరీక్షలు జరక్కుండా చర్యలు తీసుకోండి

### స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి




అధికారులతో సమావేశమైన సూర్యకుమారి, సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్షించారు. చిత్తూరు నగర శివార్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు కలెక్టర్ గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసిందన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు జిల్లాకు సరిహద్దు ప్రాంతం కావడంతో బాల్య వివాహాలు కట్టడి చేయడానికి ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మేనరికం వివాహాలతో జరిగే అనర్థాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు నివేదిక పంపాలని కోరారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంహెచ్‌వో సుధారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మహిళా పోలీసు ఎస్‌ఐ నాగసౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## బర్డ్ డైరెక్టర్ జగదీష్‌కి అభినందన



జగదీష్‌ని అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి (గాంధీరోడ్డు), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌ని సోమవారం రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్)ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. గతంలో డైరెక్టర్‌గా పనిచేసి బర్డ్‌కి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, తిరిగి బాధ్యతలు చేపట్టడంతో పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

### భర్త మృతి.. భార్య, అల్లుడి పరిస్థితి విషమం



వెంకటస్వామి(ఫైల్‌ఫొటో) - గాయపడిన నారాయణమ్మ

కల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతి చెందగా.. భార్య, అల్లుడి పరిస్థితి విషమంగా మారింది. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ చిగరమాకులపల్లెకు చెందిన వెంకటస్వామి (70), నారాయణమ్మ దంపతులు ఆదివారం మండలంలోని పాతపేట పంచాయతీ పూరేడువాండ్లపల్లెలోని తమ కుమార్తె ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం అల్లుడు వాసు తన ద్విచక్రవాహనంపై అత్తమామలను ఎక్కించుకుని వారి స్వగ్రామంలో వదిలేందుకు బయల్దేరాడు. కల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై వెళుతుండగా వీరి వాహనాన్ని అరుణాచలం వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటస్వామి మృతిచెందాడు. నారాయణమ్మ, వాసు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. వెంకటస్వామి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## టీబీ నివారణపై అవగాహన కల్పించాలి



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీబీ నివారణపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డితో కలిసి ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీబీకి సంబంధించి స్థిరమైన లక్ష్యాలను సాధించే ప్రయత్నాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ వెంకటరమణ

తిరుచానూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మధ్య ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## రవీంద్రరాజు వ్యాఖ్యలు సరికాదు

### వీఆర్వోల సంఘ నేతలు

తిరుపతి రూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేరిట భూపతిరాజు రవీంద్రరాజు చేస్తున్న అనాలోచిత, అసంబద్ధ, మోసపూరిత వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోబోమని సంఘ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి పుల్లూరు రాఘవరెడ్డి, వీఆర్వోలు పత్తిపుత్తూరు రమేష్, ఎం.సుమన్, ఏపీసతీష్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. విశాఖ జిల్లా వేదికగా ఏపీఆర్‌ఎస్‌ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో వ్యాఖ్యలను పలు పత్రికలు రకరకాలుగా ప్రచురించాయని తెలిపారు. కొందరు స్వార్థపూరిత ఆలోచనలతో వీఆర్వోల సంఘాన్ని చిన్నాభిన్నం చేసి, గత ప్రభుత్వ పాలకుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నారని విమర్శించారు. కాగా తమ సంఘ పేరు, రిజిస్ట్రేషన్ నంబరును అడ్డుపెట్టుకుని భూపతిరాజు రవీంద్రరాజు స్వయం ప్రకటిత అధ్యక్షుడిగా చేసిన అడ్డగోలు వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు.

## వాహన చట్టాలపై అవగాహన


యువకులు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సీఐ నాగార్జున యువకులు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు. అదే విధంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై భారీ జరిమానా విధించడమే కాకుండా, కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం మద్యం తాగి వాహనాలను నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. వారికి న్యాయస్థానం జరిమానా విధించింది.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**

పట్టణంలోని బార్లు, దాబాల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. సోమవారం బార్లు, దాబాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాబాల్లో ఆహార పదార్థాలు మాత్రమే అమ్మాలన్నారు. మద్యం విక్రయించినా, అక్కడ తాగడానికి ఏర్పాట్లు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. బార్లు మూసిన తరువాత మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పూర్వ విద్యార్థినుల అపూర్వ కలయిక



రేణిగుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2005-09 బ్యాచ్ పూర్వ విద్యార్థినులు ఆత్మీయంగా కలుసుకున్నారు. సోమవారం పాఠశాలలో ఆప్యాయంగా కలుసుకొని చదువుకున్న రోజులను, అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

## కేజీబీవీలో చురుగ్గా తరగతి గదుల నిర్మాణాలు



కేవీబీపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే ఆదిమూలం శంకుస్థాపన చేశారు. 2025-26 విద్యా సంవత్సరం లోపు ఈ గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారుగా రూ.2కోట్లకు పైగా అంచనాలతో గదులను అత్యాధునికంగా నిర్మించనున్నారు.

## వాహనం సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం


వాహనం, ఎర్రచందనం దుంగలను చూపుతున్న అధికారులు

రేణిగుంట, జూన్ 2, (ఆంధ్రజ్యోతి): వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు టీఎస్ పాళ్యం ఎఫ్ఎస్ఓ చైతన్య తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి రేణిగుంట మండలంలోని కోడూరు- రేణిగుంట మార్గంలో శ్రీనివాసపురం చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ క్రమంలో కోడూరు నుంచి రేణిగుంట వైపు వస్తున్న కారులోని డ్రైవర్ తనిఖీలను గమనించి వాహనాన్ని ఆపి అడవిలోకి పారిపోయాడన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 9 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించామన్నారు. వాహనం సహా దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించామని వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు.

## రజక సంఘ నాయకుడు గురవయ్య మృతి టీడీపీకి తీరని లోటు


గురవయ్యకు నివాళులర్పిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రజక సంఘం నాయకుడు గురవయ్య మృతి పార్టీకి తీరని లోటని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. తొట్టంబేడు మండలం ఇలగనూరుకు చెందిన టీడీపీ రజక సంఘం నాయకుడు గురవయ్య సోమవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బృందమ్మ అక్కడికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గుర్రప్పనాయుడు కండ్రిగ దళితవాడకు చెందిన రవిచంద్ర కుమార్తె ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. పుల్లారెడ్డి కండ్రిగలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్.బత్తిరెడ్డి కూడా మరణించారు. ఆయన మృతదేహానికి బృందమ్మ నివాళులర్పించారు. తొట్టంబేడు టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, నాయకులు గాలి మురళి నాయుడు, చెంచయ్యనాయుడు, కామేష్‌యాదవ్, సుశేఖర్‌నాయుడు, రాజగోపాల్, రామయ్య, పెంచలయ్య, వెంకటయ్య, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలివ్వండి: సీపీఐ


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పుత్తూరు టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చలపతి, కత్తి రవి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలంటూ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి గోపి, కృష్ణారెడ్డి, మణి, హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కార్యదర్శి రమణ, అభి తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు నిరసన పోస్టర్ల ఆవిష్కరణ

పుత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సోమవారం పుత్తూరు మండల వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ హరి మాట్లాడుతూ... గత ఎన్నికల సమయంలో ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయనందున ఈనెల 4న నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఎంపీపీ మునివేలు, నాయకులు లోకనాథం, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా బ్రాహ్మణ సంఘంలో పుత్తూరుకు ప్రాతినిధ్యం


బాలాజీశర్మ

పుత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధిగా పుత్తూరుకు చెందిన బాలాజీశర్మను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తనతో పాటు జిల్లా కమిటీలో సంయుక్త కార్యదర్శిగా బాలాజీరావు, మహిళా ప్రతినిధులుగా గీత, లలితను నియమించారని తెలిపారు.

## శ్మశాన వాటికకు స్థలం చూపించండి

వరదయ్యపాళెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కాలనీలోని ప్రభుత్వం భూమిలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని బీసీకాలనీ, గోపాలరావు కాలనీవాసులు తహసీల్దార్ సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తమ కాలనీల్లో ఎవరైనా మరణిస్తే కిలోమీటరు దూరంలో ఉన్న కాంబాకంలో అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందన్నారు.

# వీధి కుక్కల బెడద


పెద్దమసీదువీధిలో సంచరిస్తున్న వీధికుక్కలు

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధికుక్కల బెడద తీవ్రమైంది. చాలా వీధుల్లో కుక్కల సంతతి విపరీతంగా పెరిగింది. రోడ్లపై ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున సమూహంగా దర్శనమిస్తున్నాయి. వీధుల్లో సంచరించే వారిపై దాడి చేస్తున్నాయి. ప్రధానంగా పిల్లలు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులు రోడ్డులో కనిపిస్తే వెంటబడుతున్నాయి. రాత్రి వేళల్లో జనం రోడ్లపై తిరగాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఈ సమస్య పట్టణంలోని పెద్ద మసీదు వీధి, ముత్యాలమ్మ గుడి వీధి, హరహరబావి వీధి, ప్రాజెక్టు వీధి, బీపీ అగ్రహారం, వెలంపాళెం, సంతమైదానం, ఎన్టీఆర్‌నగర్, ఆర్టీసీ కూడళ్లలో ఎక్కువగా ఉంది. ఇకనైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం: వైసీపీ

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దామని వైసీపీ తిరుపతి జిల్లా పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ అధినేత జగన్ పిలుపు మేరకు ఈనెల 4న బుధవారం వెన్నుపోటు దినాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ శ్రీనివాసులు, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చెప్పారు. వరదయ్యపాళెంలో పోస్టర్లను ఆవిష్కరించారు. దయాకర్‌రెడ్డి, మణినాయుడు, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చెరువుగట్టుకు సమీపంలో వంతెన పక్క 45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## లక్ష్మీహయగ్రీవస్వామికి రాగి తొడుగుల బహూకరణ

ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమందలో ఇటీవల నిర్మించిన లక్ష్మీహయగ్రీవస్వామి ఆలయానికి మర్రిమందకు చెందిన నందగోపాల్ రాగి తొడుగులను బహూకరించారు. ఆలయ ధర్మకర్త గిరిప్రసాద్‌రెడ్డి వాటిని స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

## హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌కు ఘనసన్మానం



ఏర్పేడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హస్తకళల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పి.హేమాక్షి రాయల్, యుగంధర్, మురళిరెడ్డి, జనార్దన్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డిస్కం సీఎండీకి అభినందనలు

తిరుపతి(ఆటోనగర్), జూన్2 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించిన సీఎండీ కె.సంతోషరావుకు సీఐటీయూ నేత కందారపు మురళి సోమవారం అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యలపై పలు మార్లు చర్చలు జరపడంతో మొదటి విడతలో రూ.10 లక్షల బీమా మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచారని తెలిపారు. వాచ్‌మన్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా ప్రమోషన్ పొందిన వారికి షిఫ్ట్ ఆపరేటర్ల వేతనాలు చెల్లించాలని కోరారు. వారికీ న్యాయం జరిగేలా చూస్తామని సీఎండీ హామీ ఇచ్చారని తెలిపారు. పీఆర్‌సీ అనంతరం కార్మికులకు బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎండీని కలసిన వారిలో సీఐటీయూ. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఉన్నారు.

## స్పీడ్‌బ్రేకర్‌కు రంగులు



వరదయ్యపాళెం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం ప్రధాన రహదారి వద్ద ప్రమాదాలను నివారించడానికి బీజేపీ నాయకుడు అన్వేష్ సామాజిక బాధ్యతగా స్పీడ్‌బ్రేకర్‌కు సోమవారం రంగులు అద్దించారు. కామిరెడ్డి రాఘవరెడ్డి, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్‌పురం, కారణిమిట్ట, కనమనం బేడు, బీఎన్‌కండ్రిగ ఈబీసీ గిరిజనులకు ఇంటి స్థలాలు కేటాయించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కత్తి ధర్మయ్య, చిన్నిరాజ్ మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వం పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేస్తూ జీవో విడుదల చేసి నా ఇప్పటి వరకు స్థలాలు చూపలేదన్నారు. అనంతరం ఆర్ఐ నల్లయ్యకు వినతిపత్రం అందజేశారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల ను టీడీపీ ప్రభుత్వం అమ లు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అర్హులకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్ర, మురళి, బాలగురునాథం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల సంస్కృతిని అరికట్టండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 2(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రోజురోజుకూ ఫ్లెక్సీల సంస్కృతి పెరుగుతోందని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, అరికట్టాలని సీపీఎం నేత కందారపు మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరానికి రోజుకు లక్ష మందికి పైగా భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని, ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, చివరకు రౌడీలు కూడా తమ అనుచరుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## హ్యాండ్ బ్రేక్ లాగడంతో బోల్తా పడ్డ కారు

**సురక్షితంగా బయటపడ్డ కుటుంబ సభ్యులు**



పిచ్చాటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి వద్ద సోమవారం సాయంత్రం చెన్నై నుంచి నగరికి వెళుతున్న కారు బోల్తా పడింది. అయితే అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. నగరి మండలం చింతలపట్టెడవాసులు బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా కీళపూడి వద్ద కారులో ప్రయాణిస్తున్న బాలుడు హ్యాండ్ బ్రేక్ లాగాడు. దీంతో కారు బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కారు డ్రైవర్‌ని మందలించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించి పంపించారు.

## శాస్త్రోక్తంగా కుంభాభిషేకం


విశేష అలంకరణలో పాల మునీశ్వరుడు

పిచ్చాటూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరంలో పాల మునీశ్వరస్వామి ఆలయ ప్రథమ కుంభాభిషేకం మహోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, హోమం, బాల త్రిపుర సుందరి హోమం, పాల మునీశ్వర స్వామి దశపూజ శాంతి, భద్రాకాళికి మూలమంత్రం, మహాభిషేకం, కలశాభిషేకం, మహా దీపారాధన నిర్వహించారు. సాయంత్రం బాల త్రిపుర సుందరి అమ్మవారి చందన కాప్పు, లలిత సహస్రనామం, అర్చన, అభిరామి పారాయణం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## యోగాంధ్రను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను విజయవంతం చేద్దామని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు పిలుపునిచ్చారు. 18వ వార్డు పరిధిలో సోమవారం సచివాలయ ఉద్యోగి ఝాన్సీ, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 2కోట్ల మంది యోగాసనాలు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందోన్నారు. ఇందులో యోగాంధ్రకు సంబంధించిన యాప్‌లో తమ పేర్లను ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘం డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు పేట బాలాజీరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, మునిరాజాయాదవ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ



బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు వెల్లువెత్తాయి. మ్యుటేషన్, ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు, భూములకు సంబంధించిన వినతులు వచ్చినట్టు ఆర్ఐ నల్లయ్య తెలిపారు. వచ్చిన ప్రతి సమస్యను రికార్డులో నమోదు చేసి విచారణ చేపట్టి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

## వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## ముక్కంటి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ దుప్పాల వెంకటరమణకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పాల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రకృతి వ్యవసాయం మేలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎంపీడీవో వెంకటరత్నమ్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆర్గానిక్ కూరగాయలను విక్రయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీఎస్‌పురం, కనమనంబేడు, బీఎన్‌కండ్రిగ తదితర గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలను, వరిని ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, రిసోర్సు పర్సన్లు జయలక్ష్మి, ఆశా, రేవతి తదితరులు పాల్గొన్నారు.